క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



పోతుగల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో రైతు భరోసా నిధుల విడుదలపై సీఎం చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, రాజు, తిరుపతి, ధర్మేందర్, అంజనేయులు, ప్రశాంత్, బాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జంగ రాజు, ఆది బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
తంగళ్లపల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు టోని అన్నారు. మండలంలోని జిల్లెల్లలో రైతు భరోసా నిధులు విడుదలైన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్, పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సింగం, బాలు, రాజు, ప్రశాంత్, భూపతి, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 28 మందికి జైలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 14 రోజులుగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 28 మందిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా జైలు, జరిమానాలు విధిస్తూ వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. అనంతరం వారికి ఎస్సై రాజుతో కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఆలయానికి రూ. లక్ష విరాళం



శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గంభీరావుపేట: విదేశాల్లో స్థిరపడినప్పటికీ వీలు దొరికినప్పుడల్లా అమ్మమ్మ ఊరికి సేవ చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు సిరినేని శ్రీధర్‌రెడ్డి. ఆయన వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. చిన్నతనంలో అమ్మమ్మ ఊరైన గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలో పెరిగారు. దీంతో గ్రామాభివృద్ధి, ఆలయాభివృద్ధిలో తనవంతు సాయం అందిస్తున్నారు. శుక్రవారం గ్రామంలోని శ్రీ వీరాంజనేయస్వామి క్షేత్రానికి రూ. లక్ష విరాళంగా ఇచ్చి ఉదారత చాటుకున్నారు. అంతకు ముందు ఆలయంలో ధ్వజస్తంభాల నిర్మాణానికి రూ. 25వేలు విరాళమిచ్చారు. శ్రీధర్‌రెడ్డి మల్లారెడ్డిపేటకు వచ్చిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మణిదీప్‌రెడ్డి, కమిటీ సభ్యులు రాంచంద్రం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని గ్రామ రైతులు శుక్రవారం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుజాత మాట్లాడుతూ.. గ్రామ శివారులో ప్రభుత్వ భూములను గుర్తించి సర్వేయర్‌తో సర్వే చేయించి భూమిని కేటాయిస్తామన్నారు. రైతులు ఆకుల మురళిగౌడ్, లక్ష్మణ్, దేవయ్య, సురేశ్, నర్సయ్య, వెంకటేశ్, తదితరులున్నారు.

డెయిరీ చైర్మన్‌గా నారాయణరావు



నారాయణరావును సన్మానిస్తున్న డైరెక్టర్లు, రైతులు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ పాలకేంద్రం (డెయిరీ) చైర్మన్‌గా వెన్నమనేని నారాయణరావు ఏడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకేంద్రంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో నారాయణరావును పాల ఉత్పత్తిదారులు చైర్మన్‌గా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా మాధవరావు, రామచంద్రరావు, అంజయ్య, రవి, అనమేని రాజు, చెక్కపల్లి అంజయ్య, వంగ దేవయ్య, రేపాక కిషన్, నిమ్మల అంజయ్యలు ఎన్నికయ్యారు. సూపర్‌వైజర్ ప్రసాద్, సెక్రటరీ రాజేశ్, టెస్టర్ నరేశ్ ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

- ఉదయం డీడీలతో ఇసుక.. రాత్రి అక్రమ దందా
- బోర్ల వద్ద ఇసుక తవ్వకాలతో రైతుల ఆందోళన
- చర్యలు తీసుకోవాలని డిమాండ్



మాన్వాడ వాగు నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న అక్రమార్కులు

బోయినపల్లి: మధ్యమానేరు ప్రాజెక్టు పరిసరాల్లో మట్టి, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. కొందరు ఇసుక.. మరి కొందరు మట్టిని అక్రమంగా తరలిస్తూ అడ్డదారిలో సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. మండలంలోని మాన్వాడ మిడ్ మానేరు మానేరు వాగు నుంచి ఇసుక, కొదురుపాక, వరదవెల్లి, వెంకట్రావుపల్లి పరిసరాల్లోంచి మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక తరలింపు డీడీలు ఒకరిపేరు ఉంటే మరొకరికి ఇసుక సరఫరా చేస్తున్నారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

రాత్రిపూట తవ్వకాలు

మిడ్‌మానేరు ప్రాజెక్టు డౌన్ స్ట్రీమ్ నుంచి రెవెన్యూ అధికారుల అనుమతులతో ఇసుక రవాణా చేస్తున్నారు. ఉదయం ఇందిరమ్మ ఇళ్లకు అధిక ధరలతో ఇసుక తరలిస్తున్నారు. డీడీ డబ్బులు రూ. 450 ఉచితంగా ఇస్తుండగా, ఒక్కో ట్రాక్టర్ ట్రిప్ ఇసుక రవాణాకు ఏరియాను బట్టి రూ. 3 వేల నుంచి రూ. 4వేల వరకు అధిక ధరలు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇటీవల రాత్రిపూట పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. రాత్రిపూట టిప్పర్లతో ఇసుక తరలిస్తున్నారని పలువురు తెలుపుతున్నారు. ఇసుక తరలించేవారికి ఏ ప్రాంతం నుంచి తరలించాలో ఓ అధికారి దారులు సూచిస్తున్నట్లు తెలిసింది. మాన్వాడ వాగులో బోర్ల ద్వారా సేద్యం చేస్తున్న రైతులు తమ బోర్ల పరిసరాల్లో రాత్రిపూట ఇసుక తవ్వకాలు చేపట్టడంతో బోర్లు చెడిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

మానేరులో మట్టి దోపిడీ

మధ్యమానేరు ప్రాజెక్టు కొదురుపాక, వరదవెల్లి శివారులో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోందంటున్నారు. ప్రాజెక్టులో నీరు ఎక్కువగా లేకపోవడంతో ఇదే అదనుగా భావించి దందాకు పాల్పడుతున్నారు. జేసీబీలతో మట్టి తవ్వకాలు చేపడుతూ టిప్పర్ల ద్వారా వెంచర్లకు, ఇతరత్రా పనులకు వినియోగిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. వెంకట్రావుపల్లి ఉప వరదకాలువ నుంచి సైతం జేసీబీ టిప్పర్లతో పెద్ద ఎత్తున మట్టి రవాణా చేస్తున్నారు. అక్కడ వరదకాలువ కట్టలు మొత్తం కనిపించకుండా పోయాయి. జేసీబీలు, ట్రాక్టర్లకు రేటు నిర్ణయించి తమ పనులు సాఫీగా చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా విషయంలో కొందరు అధికార పార్టీ నేతలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

బోర్ల వద్ద ఇసుక తీస్తున్నరు



మాన్వాడ మానేరు వాగులో బోరుబావి ఆధారంగా చాలామంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. బోరుబావుల వద్ద ఇసుక తవ్వకాలు చేయడంతో బోర్లు నడవడం లేదు. ఇసుక ట్రాక్టర్లు తొక్కడంతో చెడిపోతున్నాయి. బోర్ల వద్ద ఇసుక తీయొద్దు.

– సాయికృష్ణ, మాన్వాడ, రైతు

కేసులు నమోదు చేస్తున్నాం



ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు. ఇటీవల ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశాం. ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం. అక్రమ చర్యలు సహించేది లేదు.

– శ్రీనివాస్, వేములవాడ రూరల్ సీఐ

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి పనులకు నిధులు



మాట్లాడుతున్న జిందం చక్రపాణి

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ నేతలు సిరిసిల్ల మున్సిపల్ అభివృద్ధికి నయాపైసా తేలేదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఆరోపించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు ఇచ్చిన రూ. 2కోట్ల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను కాంగ్రెస్ నేతలు ప్రారంభోత్సవాలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే పట్టణంలో రూ. 40కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకాగా వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి అడ్డుకుందన్నారు. శ్రీనగర్‌కాలనీ గుండా నిర్మించే పెద్దవరద కాల్వను, టెండర్లు పూర్తయిన పనులకు నిధులు తీసుకువచ్చి కాంగ్రెస్ నేతలు పట్టణాభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. నాయకులు ఆకునూరి శంకరయ్య, గుండ్లపెల్లి పూర్ణచందర్, సందీప్, అడ్డగట్ల మురళి, సబ్బని హరీశ్, కంచర్ల రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అతివేగంతో భయాందోళన



రాంగ్ రూట్‌లో అతివేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

ఎల్లారెడ్డిపేట: మండలంలో నిత్యం జరుగుతున్న ఇసుక ట్రాక్టర్ల ప్రమాదాలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు జరిగి ప్రమాదం తప్పింది. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు అతి వేగంతో వాహనాలు నడపడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని పదిరకు చెందిన ఓ ఇసుక ట్రాక్టర్ స్థానిక పాత బస్టాండ్‌లో శుక్రవారం అతివేగంతో రాంగ్ రూట్లో వెళ్లగా ప్రజలు అప్రమత్తమై తప్పించుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం రాచర్లగొల్లపల్లిలో కారును ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో కారు ధ్వంసమై, అందులో ఉన్నవారు త్రుటిలో తప్పించుకున్నారు. రెండు ప్రమాదాలపై రెవెన్యూ, పోలీసు అధికారులు విచారణ జరిపి ఇసుక వాహనాల ప్రమాదాలను అరికట్టాలను మండల ప్రజలు కోరుతున్నారు.

పదిరలో ఇసుక దందాపై ఘర్షణ

పదిరలో ఇసుక ట్రాక్టర్ యాజమానులు ఓ యూనియన్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. అందులో ట్రాక్టర్ యాజమానులు రూ.50వేలు చెల్లించి సభ్యత్వం తీసుకుని ఇసుకను తరలించే నిబంధనలు పెట్టుకున్నారు. అయితే యూనియన్‌లో లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. ఇసుకను అక్కడే ఖాళీ చేయించారు. దీంతో ఇసుక ట్రాక్టర్ల యాజమానుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రవీందర్, యోగా అభ్యాసకులు

సిరిసిల్ల అర్బన్ : పట్టణంలో శనివారం నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పతాంజలి, ఆయూష్ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా అభ్యాసకులు శ్రీనివాస్, దూస రమేష్, విజయ్,శ్రీనివాస్, కోడం రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

‘టీబీ ముక్త్ భారత్ అభియాన్’



రుద్రంగి: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమం వైద్యాధికారి సురేశ్ కుమర్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా టీబీ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీలు అర్చన, లక్ష్మీ ప్రసన్న, సూపర్‌వైజర్లు మణెమ్మ, కౌసల్య, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, సూపర్‌వైజర్ గంగాధర్, స్థానిక వైద్య బృందం, ఆశాలు పాల్గొన్నారు.
ఇల్లంతకుంట: క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వైద్యుడు కట్ట రమేశ్ తెలిపారు. మండలంలోని ముస్కానిపేటలో క్షయవ్యాధి పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. వివిధ పరీక్షలు నిర్వహించి 10 మంది అనుమానితుల నుంచి సేకరించామని, 15 మంది క్షయ లక్షణాలున్నవారిని వాహనంలో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. వైద్యారోగ్య అధికారి వెంకటరమణ ప్రసాద్, సూపర్‌వైజర్ జవహర్, శోభారాణి, ఏఎన్ఎం కవిత, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని బీవైనగర్ గోల్డెన్ టెంపుల్ మూడో వార్షికోత్సవ ఉత్సవాలను శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. కట్టమైసమ్మ, పోచమ్మ తల్లి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంభాభిషేకం, గణపతి, నవగ్రహారాధన, పూర్ణాహుతి, మహాన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొండ ప్రతాప్, వైస్‌చైర్మన్ బింగి ఇజ్జగిరి, ప్రధాన కార్యదర్శి ఎనగందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మంజూరైన ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇసుక ఇతర సదుపాయాల కల్పకను కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు బండారి బాల్‌రెడ్డి, గంట వెంకటేశ్ గౌడ్, ఎడ్ల రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

బోయినపల్లి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని విలాసాగర్ హైస్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాల గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై, నేరాలకు పాల్పడుతున్నారన్నారు. హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బంది

ఇల్లంతకుంట: సెస్ పరిధిలోని మండలంలోని పలు గ్రామాల్లో వారం రోజులగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. దీని కింద చీర్లవంచ, పెద్దలింగాపూర్, కందికట్కూర్, గుండారం, ఇల్లంతకుంట, గాలిపెల్లి అర్బన్, సిద్దిపేట పంప్‌హౌస్, ఫీడర్లు ఉన్నాయి. అప్రకటిత విద్యుత్ కోతలతో ఇక్కట్లు పడుతున్నామని మండల విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. సెస్ ఏఈ నగేష్‌కుమార్ ను వివరణ కోరగా ఇల్లంతకుంట 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లోని గుండారం ఫీడర్‌లో సమస్య వల్ల విద్యుత్ అంతరాయం ఉందన్నారు. శనివారం సమస్యను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

● సమయానికి బస్సు నడపాలి

గంభీరావుపేట: మండలంలోని శ్రీగాధ గ్రామానికి గతంలో పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం ఉండేదని దానిని పునరుద్ధరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు కోరారు. ఈ మేరకు సిరిసిల్ల ఆర్టీసీ డిపో అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందించారు. శ్రీగాధ నుంచి గంభీరావుపేటలోని కేజీ టు పీజీ విద్యా సంస్థలకు, దమ్మన్నపేటలోని మోడల్ స్కూల్‌కు దాదాపు వందమంది విద్యార్థులు వెళ్తారన్నారు. సమయానికి బస్సు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాలు, కళాశాలలకు వెళ్లడం మానేస్తున్నారని పేరొన్నారు. సమయానుగుణంగా బస్సు నడపాలని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

● వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

కోనరావుపేట: సెస్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సెస్ ఏఈ దివ్య పేర్కొన్నారు. కొలనూర్‌లో ఎస్ఎస్ 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఐదు అనధికార బోరు మోటార్లు నడుస్తున్నాయని, వాటితో అధికలోడ్ ఏర్పడి బోర్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. ఐదు మోటార్లకు ఎలాంటి అనుమతి లేకపోవడం వల్లే విద్యుత్ కనెక్షన్లు తొలగించామన్నారు.

● కేంద్రమంత్రి సంజయ్ పరామర్శ

బోయినపల్లి: మండలంలోని కోరెం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు సోదరులు ప్రముఖ జనరల్ సర్జన్ చెన్నాడి రవీందర్‌రావు అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. చెన్నాడి సుధాకర్‌రావు, చెన్నమనేని వికాస్‌రావుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్, నర్సింగోజు రామకృష్ణ, గుడి రవీందర్‌రెడ్డి, ఉదారి నర్సింహాచారి, మెరుపుల గంగాధర్, కొనుకటి హరీశ్, కొలుపుల సాయి, రాజూరి కిరణ్ తదితరులు ఉన్నారు.

● మా అనాథాశ్రమంలో ఎమ్మెల్యే సతీమణి వర్ధంతి

గంభీరావుపేట: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ప్రథమ వర్ధంతిని ఆయన ఆత్మీయ స్నేహితులు మండలకేంద్రంలోని ‘మా’ అనాథ ఆశ్రమంలో నిర్వహించారు. వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేసి పండ్లు, స్నాక్స్ అందించారు. ఆశ్రమం నిర్వహణకు రూ. 10వేలు ఆర్థికసాయం చేశారు. ఎమ్మెల్యే ఆత్మీయ స్నేహితులు భాస్కర్‌రెడ్డి, సత్యంరెడ్డి, తదితరులున్నారు.

● బాధ్యతలు స్వీకరణ

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట ప్యాక్స్ తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 18 నుంచి జూలై 22 వరకు ఇల్లంతకుంట ప్యాక్స్ చైర్మన్ రోండ్ల తిరుపతిరెడ్డి తన వ్యక్తిగత పనులపై అమెరికా వెళ్లారు. శుక్రవారం నుంచి ప్యాక్స్ తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి కొనసాగనున్నారు. ప్యాక్స్ కార్యదర్శి రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు కొమురయ్య, లక్ష్మి, లచ్చయ్య,సత్తయ్య, తదితరులున్నారు.



ముస్తాబాద్: మండలంలోని చీకొడులో మల్లన్నసాగర్ మెయిన్ కెనాల్ తుంగ, గడ్డితో నిండిపోయింది. వానాకాలంలో వచ్చే వరద నీటికి ఇది అడ్డంకిగా మారుతుందని రైతులు వాపోతున్నారు. కెనాల్ నిర్మించినప్పటి నుంచి దానిని శుభ్రం చేయలేదని పేర్కొంటున్నారు. మోహినికుంట నుంచి చీకొడు, నామాపూర్ వరకు ఉన్న మల్లన్నసాగర్ కెనాల్‌ను శుభ్రం చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
శ్రీనివాస్, ప్రాజెక్టు డీఈఈ, సెల్‌నెంబర్: 9912369593

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి



సిరిసిల్ల అర్బన్ : మాట్లాడుతున్న రంజిత్ మోహన్

సిరిసిల్ల అర్బన్ : ప్రధాన మంత్రిగా మోదీ 11ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంజిత్ మోహన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, ఉచిత రేషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేశారన్నారు. బీజేపీ నాయకులు ఆడెపు రవీందర్, మల్లారెడ్డి, నాగుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.
ముస్తాబాద్: వికసిత్ భారత్ బీజేపీ కేంద్ర ప్రభుత్వ సంకల్పమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, రంజిత్ మోహన్ అన్నారు. ముస్తాబాద్‌లో వికసిత్ భారత్ సంకల్ప సభ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి ఆధ్వర్యంలో మండలకేంద్రంలో నిర్వహించారు.బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్, అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, సంతోష్‌రెడ్డి, మెరుగు అంజాగౌడ్, శ్రీనివాస్‌రావు, ఎదునూరి గోపి, నరేశ్, శంకర్, సంజీవ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.
బోయినపల్లి: మండలంలోని విలాసాగర్, అనంతపల్లి, బోయినపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు రచ్చబండ నిర్వహించారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్, గుడి రవీందర్‌రెడ్డి, ఉదారి నర్సింహాచారి, గంగిపల్లి స్వామికుమార్, గంగాధర్, సుంకపాక ప్రభు, గంగాధర్‌చారి తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు

సిరిసిల్ల అర్బన్ : మాజీ మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకుడు గజ్జెల కాంతంకు లేదని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు అందె సుభాష్ అన్నారు. శుక్రవారం పట్టణ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచుల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు, బీఆర్ఎస్ నాయకుడు బాలయ్య, రాజిరెడ్డి,కుంబాల మల్లారెడ్డి, సుంకపాక మనోజ్‌కుమార్, సిలివేరి చిరంజీవి, వరుణ్, గుండు ప్రేమ్‌కుమార్, రామాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో శుక్రవారం సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఆధ్వర్యంలో వాహనాల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మొగిలి మాట్లాడుతూ వాహన పత్రాలు పరిశీలించి, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు విధిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని.. వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహన తనిఖీల్లో తంగళ్లపల్లి ఎస్సై బి.రామ్మోహన్, ట్రెయినీ ఎస్సైలు కె.వినీతా రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని నిత్య యోగా సాధకుడు దుంపెన రమేశ్ తెలుపుతున్నారు ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన రమేశ్. ఆయన గత 25 ఏళ్లుగా యోగా చేస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. – ఎల్లారెడ్డిపేట

తేలనున్న మల్లయ్యకుంట హద్దులు



మిల్లు యజమానుల వద్ద వివరాలు సేకరిస్తున్న వివిధ శాఖల అధికారులు (ఫైల్)



మిల్లు నుంచి బయటకు వచ్చిన మురుగునీరు (ఫైల్)

- కుంట స్థలంలోనే మిల్లుల నిర్మాణం..!
- వేగవంతంగా విచారణ
- మిల్లు యజమానుల్లో గుబులు

వేములవాడరూరల్: మండలం మర్రిపల్లి శివారు సర్వేనంబర్ 750లో మల్లయ్యకుంట ఉండగా ఆ ప్రాంతంలో కొందరు వ్యాపారులు ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కుంట స్థలాన్ని కూడా కబ్జా చేసి నిర్మాణం చేపట్టారన్న ఫిర్యాదులొచ్చాయి. దీంతో కొన్ని నెలలుగా పలు విభాగాలకు చెందిన అధికారులు ఈ కుంట స్థలంపై విచారణ చేపట్టారు. ఈనెల 11న కలెక్టర్ తన కార్యాలయంలో మిల్లు యజమానులతో విచారణ చేపట్టారు. మల్లయ్యకుంట స్థలం హద్దులు, మిల్లు యజమానులు నిర్మించిన మిల్లులపై పూర్తి విచారణ జరిపిన అధికారులు యజమానులపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. గ్రామ సమీపంలోనే ఈ మిల్లు నిర్మించడంతో పక్కనే ఉన్న పంటపొలాలు, కస్తూర్బా పాఠశాలలకు, మర్రిపల్లి గ్రామస్తులకు రోజూ దుర్వాసన వస్తోంది. ఈ విషయంపై గతంలో గ్రామస్తులు ప్రజావాణిలోఅధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన అధికారులు నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. ఈ విషయంపై పూర్తినివేదిక జిల్లా అధికారులకు అందజేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్న అధికారులు మిల్లు యజమానులపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఆ ప్రాంతంలో నిర్మించిన మహాలక్ష్మి, మారుతి రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటారన్న సమాచారంతో మిగతా మిల్లుల యజమానుల్లోనూ భయం మొదలైంది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించండి

ఎల్లారెడ్డిపేట: రాజన్నపేట గ్రామానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇప్పించాలని గ్రామస్తులు, నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. వేములవాడలో శుక్రవారం నాయకులు, గ్రామస్తులు ఆది శ్రీనివాస్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.